

అన్ని రంగాల్లో విశాఖ నంబర్‌వన్ స్థానంలో ఉండాలి



- జిల్లా అధికారులతో ఎంపీ ఎం.శ్రీభరత్

జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ఆదిశగా అధికారులంతా కృషి చేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ-మానటరింగ్ కమిటీ సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతెన్నులపై ఆయన సమీక్షించారు.

10లో

అప్పన్న ఆభరణాలపై దాగుడుమూతలు

- లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నట్టు ఎనిమిది నెలల క్రితం జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి నివేదిక
- దానిని పక్కనపెట్టి ఐదుగురితో మరో కమిటీ
- ఆ కమిటీ విచారణలో కూడా నిర్ధారణ
- నెల కిందట నివేదిక సమర్పణ
- చర్యలకు అధికారుల మీనమేషాలు
- బాధ్యులకు నోటీసులతో సరి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం దేవస్థానంలో స్వామి వారి ఆభరణాలు కొన్ని అదృశ్యమయ్యాయి. మరికొన్ని ఆభరణాలు కళ్ల ముందు కనిపిస్తున్నా వాటికి లెక్కలు లేవు. ఈ విషయాన్ని తనిఖీ అధికారి గుర్తించి ఫిబ్రవరిలోనే నివేదిక ఇచ్చినా ఉన్నతాధికారులు స్పందించలేదు. మళ్లీ ఐదుగురితో కమిటీ వేశారు. వారు కూడా విచారణ చేసి నివేదిక ఇచ్చి నెల రోజులైంది. అందులోను భారీగా లోపాలు బయటపడ్డాయి. అధికారుల వద్ద లెక్కకు అదనంగా, అర్చకుల వద్ద తక్కువగా ఆభరణాలు ఉన్నట్టు తేల్చారు. వాటిపై సంబంధితులను వివరణ కోరి, చర్యలు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారు.



సింహాచలం దేవస్థానంలో స్వామి వారికి చెందిన ఆభరణాలతో పాటు ఉప ఆలయాల్లో కొన్ని వస్తువులు కనిపించడం లేదని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకర ఆచారి ఫిర్యాదుపై దేవదాయ శాఖ కమిషనరేట్ అధికారులు విచారణకు ఆదేశించారు. జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి (జేవీఓ) పల్లంరాజు ఈ ఏడాది ఫిబ్రవరిలో తనిఖీలు చేసి అదే నెలాఖరున నివేదిక సమర్పించారు. ఆభరణాల మ్యూజియంలో ముత్యాల హారం బరువు 65 గ్రాములు తక్కువ ఉందని నివేదించారు. ఉప ఆలయాలకు భక్తులు ఇచ్చిన 16 వెండి వస్తువుల బరువు సుమారు 10 కిలోలు ఉంటుందని, వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయలేదని పేర్కొన్నారు. అలాగే మరికొన్ని అంశాలు ప్రస్తావించారు. భక్తులు ఏమైనా విరాళంగా ఇస్తే వాటికి రశీదులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు ఆరు నెలలు జాప్యం చేశారు.

ఎవరినో రక్షించాలని ఐదుగురితో కమిటీ వేశారు. ఆ కమిటీ కూడా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విచారణ చేసి నివేదిక ఇచ్చింది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆనందకుమార్ దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లిపోతూ తన ఆధీనంలో ఉన్న ఆభరణాలను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిణి రాధకు అప్పగించారు. అందులో రిజిస్టర్‌లో నమోదు కాని వెండి ఆభరణాలు 47 ఉన్నాయి. వాటి బరువు సుమారు 20 కిలోలు. అవన్నీ భక్తులు ఇచ్చినవే. వాటికి రశీదులు లేవు. లెక్కలు లేవు. భక్తులు విరాళంగా ఇచ్చిన వస్తువుల సంఖ్య పెరుగుతుంటే...వాటిని నమోదు చేయకుండా ఎందుకు పక్కన పెడుతున్నారనేది ఇక్కడ పెద్ద ప్రశ్న. దీనిపై సదరు ఏఈఓ నుంచి వివరణ కోరుతూ నోటీసు ఇచ్చారు. మూడు రోజుల్లో సమాధానం కోరారు. ఏమైందో ఏమో చర్యలు లేవు.

ఇకపోతే ప్రధాన అర్చకులు ఇద్దరి వద్ద ఉండాల్సిన స్వామి వారి సేవలకు సంబంధించిన బంగారు ఆభరణాల్లో 135 గ్రాముల బరువు కలిగిన ఎనిమిది వస్తువులు కనిపించకుండా పోయినట్టు కమిటీ గుర్తించింది. అందులో అమ్మవార్ల మంగళ సూత్రాలు వంటివి ఉన్నాయి. వెండి వస్తువుల్లో 39 కనిపించలేదు. వాటి బరువు సుమారు 120 కిలోలు. అందులో ద్వారానికి అమర్చే వెండి తాపడాలు, వెండి పళ్లేలు వంటివి ఉన్నాయి. వీటిపై ఆ ఇద్దరు ప్రధాన అర్చకులకు అధికారులకు నోటీసులు ఇస్తే... ఏనాడూ తమకు అధికారికంగా ఆయా వస్తువులను అప్పగించలేదని సమాధానం ఇచ్చినట్టు తెలిసింది.

రాజీ ప్రయత్నాలు

రాష్ట్రంలో ప్రధానమైన ఆలయాల్లో సింహాచలం ఒకటి. ఈ లోపాలన్నీ బయటకు వస్తే పెద్ద ఎత్తున దుమారం రేగుతుందని ఉన్నతాధికారులు భయపడుతున్నారు. భక్తులు ఇస్తున్న విరాళాలకు లెక్క లేకపోవడం, వాటికి రికార్డులు నిర్వహించకపోవడం, స్వామి వారి సేవకు వాడే వస్తువులే

... మిగతా 8వ పేజీలో



గాదిరాజుప్యాలెస్ వద్ద సముద్రంలో కలుస్తున్న మురుగు నీటికాలువను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కమిషనర్ కేతన్‌గార్గ్

మురుగునీరు సముద్రంలో కలవకుండా చర్యలు

- కొత్తగా నిర్మించే ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు అనుసంధానం
- ఏడాదిన్నరలో శతశాతం అమలు
- పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

నగరంలో మురుగునీరు సముద్రంలో కలవకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. శుక్రవారం నగరానికి విచ్చేసిన ఆయన బీచ్‌రోడ్డుతోపాటు సముద్ర తీరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాండురంగాపురం డౌన్, గాదిరాజు ప్యాలెస్ వద్ద మురుగునీరు గెడ్డ ద్వారా సముద్రంలో కలుస్తున్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మురుగునీరు కలిస్తే సముద్ర జలాలు కలుషితమై పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుంది కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. మురుగునీటి శుద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. మొత్తం 25 కాలువలు ద్వారా బీచ్‌లోకి మురుగునీరు చేరుతోందని, ఇప్పటికే 13 కాలువలను యూజీడీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు అనుసంధానం చేశామన్నారు. మిగిలిన వాటిని కూడా కొత్తగా నిర్మించే ప్లాంట్లకు అనుసంధానం చేస్తామన్నారు. మరో ఏడాదిన్నరలో మురుగునీరు సముద్రంలో కలవకుండా శతశాతం అడ్డుకట్ట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరాజు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో X ఆర్డీవో

రెవెన్యూలో కలకలం

తహశీల్దార్ కార్యాలయాల సిబ్బందికి నెలనెలా డీఆర్‌వో ఇండెంట్ పెడుతున్నారని కలెక్టర్‌కు ఆర్డీవో ఫిర్యాదు

- అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆరా
- మరోవైపు మండల కార్యాలయాల నుంచి సమాచారం సేకరించిన నిఘా వర్గాలు
- కలెక్టర్‌ను కలిసి రెవెన్యూ అసోసియేషన్



డీఆర్వో భవానీశంకర్



ఆర్డీవో శ్రీలేఖ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ మధ్య వివాదం అధికార వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంపై శుక్రవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు.

డీఆర్‌వో ప్రతి నెలా నిత్యావసర సరుకుల కోసం తహశీల్దారు కార్యాలయ సిబ్బందికి ఇండెంట్ పెడుతున్నారని ఆర్డీవో గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం లీక్ కావడంతో మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో అమరావతి నుంచి రెవెన్యూ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఫోన్ చేసి అన్ని వివరాలు అడిగారు. పెందుర్తి మండలం ఏకలవ్య కాలనీలో అంబేడ్కర్ విగ్రహం తొలగింపునకు యత్నం గురించి కూడా ఆరా తీసినట్టు తెలిసింది. ఆర్డీవో వ్యవహారశైలిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని చెప్పినట్టు తెలిసింది. ఇదిలావుండగా ఆర్డీవోకు ప్రభుత్వంలో కీలక వ్యక్తుల ఆశీస్సులు, డీఆర్వోకు సీఎంవో కీలక అధికారి దన్ను ఉన్నట్టు ప్రచారం సాగుతుంది.

గత ఏడాదే ఇరువురు అధికారులు జిల్లాకు బదిలీపై వచ్చారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా...ఆ తరువాత ఏమి జరిగిందో తెలియదుకాని డీఆర్వో, ఆర్డీవో మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి.

ప్రొటోకాల్ విధులు ఎక్కువగా ఆర్డీవోనే చూడాలి. అయితే ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌లలో ప్రొటోకాల్ విధులకు సంబంధించి చివరి నిమిషంలో తనకు సమాచారం ఇస్తున్నారని, పరుగుపరుగున వెళ్లేసరికి అతిథులు వెళ్లిపోతున్నారని...అందుకు తాను బాధ్యత వహించాల్సి వస్తోందని కార్యాలయ సిబ్బంది వద్ద ఆమె వాపోతున్నట్టు తెలిసింది. అయితే ఏ విషయంలోనూ ఆర్డీవో సీరియస్‌గా ఉండకపోవడంతో కొన్ని కార్యక్రమాలకు ఇతర అధికారులను నియమిస్తున్నారని వాదన ఉంది. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల పేషీలకు ఆమె చాలాకాలం నుంచి దూరంగా ఉంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. ఆర్డీవో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావడం లేదు. గతంలో పనిచేసిన ఆర్డీవోలు ప్రతి సోమవారం ఈ కార్యక్రమానికి హాజరయ్యేవారు. హెడ్‌క్వార్టర్ ఆర్డీవో అనగానే కలెక్టర్‌కు చేదోడుగా

... మిగతా 8వ పేజీలో

చురుగ్గా కేకే లైన్ డబ్లింగ్

కొత్తవలస-కిరండూల్ మధ్య అదనంగా మరో రైల్వే ట్రాక్ నిర్మాణం

- మొత్తం సుమారు 446 కిలోమీటర్లు
- ఇప్పటివరకు సుమారు 300 కి.మీ. మేర పనులు పూర్తి
- 2028 నాటికి పూర్తయ్యే అవకాశం



కేకే లైన్‌లో డబ్లింగ్ పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వాల్తేరు రైల్వే డివిజన్‌కు అత్యధిక ఆదాయం సమకూర్చేది కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్. బచేలిలోని గనుల నుంచి ఐరన్‌ఓర్‌ను ఈ మార్గంలోనే విశాఖపట్నం తీసుకువస్తారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పంపిస్తారు. ఈ మార్గం కొండలు, గుట్టలు, వాగులు మీదుగా సాగుతుంది. వర్షాలు కురిస్తే రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. కొండల పైనుంచి బండరాళ్లు పడుతుంటాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాల్సి వస్తుంది. ఒకే మార్గం ఉండడం వల్ల పరిశ్రమలకు ఐరన్‌ఓర్ సకాలంలో అందడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ కేకే లైన్‌ను డబ్లింగ్ చేయాలని (మరో మార్గం అదనంగా) నిర్ణయించారు. సుమారు 446 కి.మీ. పొడవున కొత్త మార్గం వేయాల్సి ఉంది. కొండలను తవ్వి గుహలు, నదులపై వంతెనలు నిర్మించాల్సి వస్తోంది. ఇప్పటివరకూ సుమారు 300 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి. మొత్తం పనులు 2026 మార్చి నాటికి పూర్తి కావలసి ఉండగా, ఇంకో రెండేళ్లు అదనపు సమయం పట్టే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. ఇటీవల తరచూ వర్షాలు కురుస్తుండడంతో పనులు ఆగిపోతున్నాయని చెబుతున్నారు.

ఈ సెక్షన్‌లో ఆరు బ్లాకులు ఇంకా నిర్మించాల్సి ఉంది. రెండు స్టేషన్ల మధ్య దూరాన్ని ఒక బ్లాకుగా వ్యవహరిస్తారు. అంటే 12 స్టేషన్ల మధ్య అదనపు ట్రాక్ పనులు పూర్తి కావాల్సి ఉంది. వీటిలో రెండు బ్లాకులు చాలా క్లిష్టమైనవి. టన్నెళ్లు వేయాల్సి ఉంది. ఈ పనులు 2027-28 నాటికి అయ్యే అవకాశం ఉంది. బచేలి-కిరండోల్-కొరాపుట్ మధ్య నాలుగు బ్లాకుల పనులు మిగిలి ఉన్నాయి. వాటిలో ఒక బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి కానుంది. మిగిలినవి వచ్చే ఏడాది పూర్తిచేయడానికి యత్నిస్తున్నారు.

ఆరు నెలల్లోనే 48 మిలియన్ టన్నుల రవాణా

- లలిత్ బొహ్రా, డీఆర్ఎం, వాల్తేరు

కేకే లైన్ వాల్తేరు డివిజన్‌కు గుండెకాయ లాంటిది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గత ఏడాది కంటే 21 శాతం సరకు రవాణా పెరిగింది. తొలి ఆరు నెలల్లో 48 మిలియన్ టన్నుల సరకు రవాణా చేశాం. ఎన్ఎండీసీకి ర్యాకుల కొరత రాకూడదని ఇటు నుంచి ఎటువంటి సరకు లేకపోయినా ఖాళీ ర్యాకులను పంపుతున్నాం.

అగ్గిపుడితే బుగ్గే!

బాణసంచా దుకాణాల ఏర్పాటులో ఇష్టారాజ్యం

- దుకాణానికి దుకాణానికి మధ్య పది అడుగులు దూరం ఉండాలని నిబంధన
- మూడు అడుగులు మాత్రమే విడిచిపెట్టిన వైనం
- వ్యాపారుల పేరుతో చక్రం తిప్పుతున్న దళారులు
- ఇప్పటికీ అనుమతివ్వని పోలీస్ శాఖ
- చోద్యం చూస్తున్న అగ్నిమాపక, టౌన్‌ప్లానింగ్ అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బాణసంచా దుకాణాల ఏర్పాటులో వ్యాపారులు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. పోలీస్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే ఏయూ, అల్వార్‌దాస్ మైదానాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పొరపాటున ప్రమాదం జరిగితే ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా రెండు దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండాలని నగర పోలీసు కమిషనర్ విడుదల చేసిన ఆదేశాల్లో ఉంది. వీటిని పట్టించుకోకుండా మూడు అడుగుల దూరం మాత్రేమ ఖాళీ ఉంచి దుకాణాలు ఏర్పాటుచేశారు. పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దుకాణాలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎడం పాటించకుండా ఏర్పాటుచేసిన దుకాణాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో కనీస దూరం పాటించకుండా ఏర్పాటు చేసిన దుకాణాలు

దీపావళి పండగ వస్తే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం, ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా కళాశాల మైదానం, తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేస్తారు. దీపావళికి రెండు రోజులు ముందుగా బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తారు. అయితే గతంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో వ్యాపారులు కాకుండా వైసీపీ నేతలు 'ఫైర్ మర్చంట్స్ అసోసియేషన్' పేరుతో గంపగుత్తగా బినామీపేర్లతో అనుమతులు తెచ్చుకున్నారు. ఏయూ, ఏఎస్ రాజా కళాశాల మైదానాల్లో వారే దుకాణాలు ఏర్పాటుచేసి వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది దీపావళికి బాణసంచా దుకాణాల కోసం వ్యాపారులు కాకుండా కూటమి ప్రజా ప్రతినిధి అనుచరులు ఇద్దరు రంగంలోకి దిగారు. గతంలో వైసీపీ నేతల మాదిరిగానే అసోసియేషన్ పేరుతో ఏయూ, ఏఎస్ రాజా మైదానాల్లో దుకాణాల ఏర్పాటుకు బినామీ పేర్లతో దరఖాస్తులు చేశారు. వాటిని జీవీఎంసీ, ప్రాంతీయ అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించి నిబంధనలు పాటించినట్టు నిర్ధారించుకుని అనుమతులు జారీచేయాల్సి ఉంది. అన్ని శాఖల నుంచి ఎన్‌వోసీలు తీసుకుని దరఖాస్తుకు జతచేసి పోలీస్ శాఖకు అందజేస్తే, వారు పరిశీలించి అనుమతులు జారీచేస్తారు. ఈ ఏడాది ఏయూ ఇంజనీరింగ్, ఏఎస్ రాజా మైదానాల్లో దుకాణాల ఏర్పాటుకు జీవీఎంసీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్, పోలీస్ శాఖల నుంచి అనుమతులు జారీకాకుండానే కూటమి ప్రజాప్రతినిధి అనుచరులు దుకాణాల ఏర్పాటు పనులు పూర్తిచేశారు. ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో 126, ఏఎస్ రాజా కళాశాల మైదానంలో 36 దుకాణాలు ఏర్పాటుచేసి

... మిగతా 8వ పేజీలో

ఫార్మా కాలుష్యానికి చెక్

కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఆదేశాలు

- వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి విడిచిపెడుతున్నారని ఎప్పటినుంచో మత్స్యకారుల ఆరోపణ
- తనిఖీల్లో కొత్త సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలని పీసీబీ నిర్ణయం



పరవాడ ఫార్మా సిటీ నుంచి శుద్ధి చేయని వ్యర్థాలను బయటకు విడిచిపెడుతుండడంతో సమీపంలోని మల్లోడి గెడ్డ వాగులో నల్లగా మారిన జలాలు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

ఫార్మా, ఇతర పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాల శుద్ధిపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అప్రమత్తం చేశారు. వ్యర్థ జలాలను పూర్తిగా శుద్ధి చేసిన తరువాతే సముద్రంలోకి విడిచిపెట్టేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేస్తున్నామని పరిశ్రమల యజమానులు, అన్నిరకాల పరీక్షలు చేసిన తరువాతే సముద్రంలోకి విడిచిపెట్టేందుకు అనుమతి ఇస్తున్నామని కాలుష్య నియంత్రణ మండలి చెబుతున్నా...క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. వ్యర్థ జలాల నుంచి వచ్చే దుర్గంధాన్ని స్థానికులు భరించలేకపోతున్నారు. సముద్రంలోకి కాలుష్య జలాలు విడిచిపెట్టకుండా చూడాలని మత్స్యకారులు ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం స్పందించడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కార్యాచరణ రూపకల్పనకు నడుం బిగించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో తీరం పొడవునా దివీస్ నుంచి డెక్కన్ ఫైన్ కెమికల్స్ వరకూ పలు ఫార్మా, రసాయన, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. దివీస్, రాంకీ ఫార్మా (కొత్తగా విశాఖ ఫార్మా సిటీగా పేరు మార్చారు), బ్రాండిక్స్ ఇండియా అపెరల్స్, అచ్యుతాపురం ఎఫ్లూయింట్ ట్రీట్‌మెంట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్ అండ్ ల్యాబ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్‌కు వ్యర్థ జలాల నిల్వ కోసం చెరువులు, శుద్ధి చేయడానికి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నాయి. వ్యర్థ జలాలను ట్రీట్‌మెంటు ప్లాంటులోకి విడిచిపెట్టి శుద్ధి చేయాలి. ఆ తరువాతే బయటకు విడిచిపెట్టాలి. ప్రతి ట్రీట్‌మెంటు ప్లాంటుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తాళాలు వేయాలి. శుద్ధి చేసిన జలాలను ల్యాబ్‌కు తీసుకువచ్చి పరీక్షించిన అనంతరం తాళం తీసి సముద్రంలోకి విడిచిపెట్టాలి. ఇదంతా చట్టపరంగా జరగాల్సిన ప్రక్రియ. అయితే ప్రతి పరిశ్రమ నుంచి శుద్ధి చేసిన జలాల్లో కాలుష్య కారణాలు లేవని

... మిగతా 8వ పేజీలో

దీపావళి వేళ అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

- 20, 21 తేదీల్లో సాయంత్రం ఆరు, రాత్రి 7 గంటల వరకూ అనుమతి
- 22న ఉదయం ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

దీపావళిని పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శన వేళల్లో స్వల్ప మార్పులు ఉంటాయని ఈఓ వేంద్ర త్రినాథరావు ప్రకటించారు. ఈనెల 20వ తేదీన నరక చతుర్దశి సందర్భంగా రాత్రి ఏడు గంటల వరకూ, అదే విధంగా 21న దీపావళి పండుగ కారణంగా సాయంత్రం ఆరుగంటలవరకు మాత్రమే భక్తులకు స్వామి వారి దర్శనాలు లభిస్తాయన్నారు. ఆ రెండు రోజులు రాత్రి ఆరాధన సేవా టికెట్ల విక్రయాలు ఉండవని పేర్కొన్నారు. ఈనెల 22న నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఆలయంలో స్వాతి నక్షత్ర హవనం జరగనున్నందున ఉదయం జరగాల్సిన ఆర్జిత సహస్ర నామార్చన, గరుడ సేవలను రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆర్జిత నిత్యకల్యాణం యథావిధిగా జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈనెల 23 నుంచి 27 వరకు మహా మునుల తిరునక్షత్ర పూజలను పురస్కరించుకుని సహస్ర తులసీ దళార్చన, గరుడసేవ, నిత్యకల్యాణం, స్వర్ణ పుష్పార్చన వంటి ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేశామన్నారు. ఈ మార్పులను భక్తులు గమనించాలని ఈఓ కోరారు.

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలను తీసి భక్తులతో స్పృశింపజేసి ప్రదక్షిణ జరిపారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్క స్వర్ణ తులసీ దళంతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని పాత కరాసా ప్రాంతానికి చెందిన బోర తారక రామారెడ్డి దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు శుక్రవారం వారు అందజేశారు. దాత కుటుంబీకులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించారు.

దివీస్‌లో విష వాయువు లీకై ఇద్దరికి అస్వస్థత

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ దివీస్ కర్మాగారంలో గురువారం సాయంత్రం క్వాలిటీ కంట్రోల్ రూమ్‌లో విష వాయువు లీకు కావడంతో ఇద్దరు ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. వారిని యాజమాన్యం వెంటనే ఆరిలోవలో అపోలో ఆసుపత్రికి తరలించింది. క్వాలిటీ కంట్రోల్ రూమ్‌లో రా మెటీరియల్‌ను ఇద్దరేసి సిబ్బంది ప్రతి 8 గంటలకు ఒకసారి పరిశీలిస్తుంటారు. ఈమేరకు హేమంత్,వినయ్‌కుమార్ సీపీటీ కిట్లు ధరించి పరిశీలనకు వెళ్లగా, ఆ సమయంలో రా మెటీరియల్ నుంచి వచ్చిన పొగ పీల్చడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే అధికారులు ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెప్పారు.

డొంకరపేటలో నారాయణ సేవ

తగరపువలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డొంకరపేటలో అయ్యప్ప మాలధారులకు శుక్రవారం నుంచి నారాయణ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే నెల 26వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పీఠం గురుస్వామి గాడు సన్యాసినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడుగాడు వెంకటప్పడు, కరుభుక్త ఈశ్వరరావు, అప్పలనాయుడు,తుపాకుల పైడిరాజు, సురాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి లక్ష్మీపురంలో...

లక్ష్మీపురం అయ్యప్ప సేవా పీఠంలో ఈనెల 22 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు జరిగే నిత్యాన్నదాన కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు గాడు తాతినాయుడు మాట్లాడుతూ 41 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని మాలధారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పీఠం ధర్మకర్తను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయబాబు, పైడినాయుడు, మజ్జివలస పీఏసీఎస్ అధ్యక్షుడు కనకల వెంకటరమణ పాల్గొన్నారు.

పద్మనాభుని ఆలయంలో పవిత్రోత్సవాలు



ఆలయంలో హోమాలు చేస్తున్న వేద పండితులు

పద్మనాభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనంత పద్మనాభుని పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వేదపండితులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, అగ్నిమథనం, త్రేతాగ్ని ప్రణయం, విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం పవిత్రాలకు పూజలు జరిపారు. సాయంత్రం నిత్య హోమాలు, స్వామివారి మూల మంత్ర హోమం, పవిత్రాల అబిమంత్రణ, మహా శాంతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పద్దు, పైడిరాజు, బుగత రాము తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ లెక్చరర్ ఉపేంద్ర

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థుల ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని రిటైర్డ్ లెక్చరర్ మీసాల ఉపేంద్ర అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షా రంభ్ (స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సదుపాయాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదిగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సీహెచ్ విష్ణుమూర్తి, ఐక్యూ కోఆర్డినేటర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'దళితుల భూములను గూగుల్‌కు కేటాయించడం తగదు'

ఆనందపురం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తర్లువాడ గ్రామానికి చెందిన దళిత రైతుల భూములను గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించడం తగదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు బాధిత రైతులతో కలిసి గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1971లో ఇందిరాగాంధీ పాలనలో ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున డీపట్టాలు మంజూరు చేశారని, నాటి నుంచి వారు పంటలు పండించి జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఈ భూములను ఇప్పుడు కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు భూములు ఇవ్వమని బలవంతంగా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

'సీహెచ్‌సీని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి'

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలని ఆస్పత్రి మెడికల్ ఆఫీసరు ఫణికుమార్‌ను వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. సన్యాసినాయుడు కోరారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో సభ్యులు ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 30 పడకలుగా ఉన్న ఆస్పత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అలాగే ప్రధాన ద్వారం బాగుచేయాలని, నేమ్ బోర్డు మార్చాలని, ఆర్థోపెడిక్ వైద్యుడ్ని నియమించాలని కోరారు.

పారిశ్రామిక ప్రాంతంగా పద్మనాభం

- రాష్ట్రంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- టీడీపీ మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం మండలాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో శుక్రవారం టీడీపీ మండల నూతన కార్యవర్గం, నామినేటెడ్ పదవులు పొందిన నాయకుల పదవీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోనే తొలి ఎంఎస్ఎంఈ పార్కును నెలకొల్పామన్నారు. భూసేకరణ జరుగుతున్న అనంతవరం, కొవ్వాడ ప్రాంతాలకు కూడా పరిశ్రమలను తీసుకువస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, విశాఖపట్నం పరిసర ప్రాంతాలకే రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు నూతన కార్యవర్గాన్ని నియమించామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష తీర్పు వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం మండల కార్యవర్గంతోను, నామినేటెడ్ పదవులు పొందిన వారితోను ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా అనంతవరం జంక్షన్ నుంచి సభా ప్రాంగణానికి ఎమ్మెల్యే గంటాతో పాటు నాయకులందరూ మోటారు సైకిళ్లపై ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు గంటా రవితేజ, టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, నాయకులు కె. దామోదరరావు, చిక్కాల విజయబాబు, గంటా నూకరాజు, రామరాజు, నగేశ్ కుమార్, నందీశ్వరరావు, సత్యనారాయణ, ఆర్ఎస్ మూర్తి, లీలావతి, నందిని, గంగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు ఎమ్మెల్యే కుంతీమాధవస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

శిక్షణ తరగతుల సందర్శన

మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు పంచాయతీ సొంత వనరులపై ఇస్తున్న శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకొని ఆర్థిక పరిపుష్టి సాధించే విధంగా చేయడానికే ప్రభుత్వం ఈ శిక్షణ చేపడుతోందన్నారు. పన్నులు, అద్దెలు, లైసెన్సుల ద్వారా పంచాయతీల ఆదాయం పెంపొందించుకునే మార్గాలను ఎమ్మెల్యే గంటా వారితో చర్చించారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పాండ్రంగి గ్రామానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కె. రామరాజు ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గంటా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో విద్యావేత్త, సామాజిక సేవకుడు కొసర అప్పలనాయుడు, ఉప సర్పంచ్ వెన్ని అప్పారావు, శంకరరావు, బంగారునాయుడు, సాధు, సన్యాసిరావు ఉన్నారు.

20 ఏళ్ల వరకు లీకేజీ సమస్య ఉండదు

- అప్పన్న ఆలయ పైకప్పు మరమ్మతులు పూర్తి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



పనులు పూర్తయినట్టు పత్రాలు చూపిస్తున్న ఎమ్మెల్యే గంటా, తదితరులు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయం పైకప్పు లీకేజీ సమస్య 20 ఏళ్ల వరకు ఉండదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి చొరవతో పూణేకు చెందిన వెంకటేశ్వర ఆధ్యాత్మిక, చారిటబుల్ ట్రస్టు సుమారు రూ.5 కోట్లతో చేపట్టిన ఆలయం పైకప్పు మరమ్మతులు పూర్తి కావడంతో శుక్రవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనుకున్న సమయం కంటే ముందుగానే పనులు పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మునిరత్నంరెడ్డి మాట్లాడుతూ సనాతన సంప్రదాయ పద్ధతులతో మరమ్మతులు పూర్తి చేశామన్నారు.ఇప్పటికే ఈ విధానాన్ని శ్రీశైలం, శ్రీకాళహస్తిలో చేపట్టామని చెప్పారు. పనులకు సంబంధించిన పత్రాలను వెంకీ గ్రూప్ ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకీ గ్రూప్ ఇంజినీర్ విశాల్, 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, సింహాచలం దేవస్థానం ఈఈ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు. కాగా తొలుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పురావస్తు శాఖ రాష్ట్ర డైరెక్టర్ మునిరత్నం రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఆనందపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆటల పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కోరాడ రాజబాబు పోటీలను ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం బాలురకు కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలు ఈనెల 24వ తేదీ వరకు జరగనున్నట్టు పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు కొట్యాడ రమాదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ బి.లక్ష్మి, వేములవలస పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు నాగరాజు, కొట్యాడ రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

పద్మనాభంలో..

పద్మనాభం : పద్మనాభంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి బాలికల క్రీడాపోటీలను ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జెడ్పీ పాఠశాలల నుంచి బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పి. రమణ, బాబూలాల్, పాండ్రంగి పాఠశాల హెచ్ఎం గిరి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, పీడీలు శ్రీదేవి, చంద్రకళ, సూర్యనారాయణ, సత్యం,నారాయణమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

డస్ట్‌బిన్లు లేకపోతే జరిమానా

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జోన్ వన్ పరిధిలో ఉన్న ప్రతి దుకాణదారుడు షాపు ముందు తప్పనిసరిగా రెండు డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేయని వారికి రూ. 1000 నుంచి రూ. 5 వేలు వరకూ జరిమానా విధిస్తామన్నారు. పాలిథిన్ సంచులు వినియోగించినా జరిమానా తప్పదన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.

ఏఐపై అవగాహన అవసరం

సాగర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో సమాజాన్ని ప్రభావితం చేసే ప్రధాన సాధనంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవతరించనున్నట్టు గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య దక్షిణామూర్తి అన్నారు. శుక్రవారం ఆయన రుషికొండ గాయత్రి విద్యా పరిషత్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరిగే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఏఐలో అధ్యాపకులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉత్తమ బోధన అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు ఆచార్య ప్రగడ రాజ గణపతి, కామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆచార్య కేఎస్ బోస్, డైరెక్టర్ డి. గిరిధర్, కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి : సీఐటీయూ

తగరపువలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :చిప్పాడ దివీస్ కర్మాగారంలో భద్రతా ప్రమాణాలను పాటించాలని సీఐటీయూ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్. అప్పలనాయుడు నీలాతి రాము, గుజ్జు నరసింగరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కర్మాగారంలో ఇద్దరు టెక్నీషియన్లు అస్వస్థతకు గురవ్వడం దారుణమన్నారు. ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన బాగం స్వాతి సుధాకర్‌ను వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనరు మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి సుధాకర్ కార్యకర్తగా కొనసాగుతున్నారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి



తిరువీధిలో స్వామి, అమ్మవార్లు

సింహాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీయుజమాస బహుళ పక్ష ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై వరాహలక్ష్మీ నృసింహస్వామి గ్రామ తిరువీధి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను సకలాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి పల్లకిలో ఉంచారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల హరినామస్మరణ నడుమ తిరువీధి ఉత్సవం జరిపారు. మార్గం పొడవునా భక్తులు స్వామివారికి ఫలాలను నివేదించి, కర్పూర నీరాజనాలిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా దుకాణాలు పెట్టొద్దు

భీమునిపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని సీఐ బి. తిరుమలరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకూ భీమిలిలో నలుగురు, తగరపువలసలో 17 మంది దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేశారని చెప్పారు. జీవీఎంసీ, అగ్నిమాపక దళం, విద్యుత్, కమర్షియల్ ట్యాక్స్ తదితర అనుమతులన్నీ దరఖాస్తుకు జత చేయాలన్నారు. వీటిని విశాఖ నార్త్ డివిజన్ ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు జారీ చేస్తామని తెలిపారు.ఇప్పటికే భీమిలి, వలందపేట, నమ్మివానిపేట ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉన్న బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సచివాలయాల్లో పని చేయని కంప్యూటర్లు

సాగర్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని సాగర్‌నగర్ పీహెచ్‌సీ పై అంతస్తులో నిర్వహిస్తున్న 86, 87 సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పాడై మూలకు చేరాయి.దీంతో ప్రజలకు సేవల్లో జాప్యం జరుగుతోంది. సిబ్బంది సొంత ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల సహాయంతో విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం ఆయా సచివాలయాలకు రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు అందించింది. నిర్వహణ లోపం వల్ల కొన్నాళ్లకే మూలకు చేరాయి.కంప్యూటర్లలో ముఖ్యమైన భాగాలు మాయమైనట్టు అప్పటి విచారణలో తేలింది. రికవరీ జరిగిందా లేదా అన్న తెలియదు. కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరడంతో సిబ్బందికి, ప్రజలకు సేవల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఏదైనా సర్టిఫికెట్ ప్రింట్ కావాలంటే ప్రజలు మీసేవాకు వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది బయోమెట్రిక్ వేయడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కంప్యూటర్లు, ప్రింటర్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పని చేయని కంప్యూటర్లు, ప్రింటర్లు



ఎమ్మెల్యే గంటా, కమిషనర్ కేతన్ గార్గ్‌తో చర్చిస్తున్న మంత్రి నారాయణ

మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గంటా భేటీ

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ శుక్రవారం సాయంత్రం ఎంవీపీ కాలనీలో ఉన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యేతో పలు అంశాలపై చర్చించారు. భీమిలి నియోజకవర్గంలో మూడు ప్రధాన రహదారుల విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని గంటా కోరారు. అలాగే భోగాపురం కనెక్టింగ్ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని, మధురవాడ ప్రాంతానికి రూ.460 కోట్లతో మంజూరైన యూజీడీ, రూ. 500 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్ పనులు త్వరగా చేపట్టేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, గంటా రవితేజ కూడా పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యానికి చెక్

... 7వ పేజీ తరువాయి

నిర్ధారించుకున్న తరువాతే సముద్రంలోకి విడిచిపెడుతున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే నిర్దేశించిన ప్రమాణాల కంటే అధికంగా వ్యర్థ జలాలను ఉత్పత్తి అవుతుండడంతో శుద్ధి చేయకుండానే కాల్వల ద్వారా సముద్రంలోకి వదులుతున్నారనేది ఆరోపణలు ఉన్నాయి. అలాగే పరిశ్రమలు శుద్ధి చేసినట్టుగా చెబుతున్న జలాల్లో కూడా ప్రమాణాలకు మించి రసాయన అవశేషాలు ఉంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ జలాల్లో బలమైన ఆక్సీకరణ కారకాలు (ఫాస్ఫేట్, నైట్రోజన్, క్రోమియం, ఇతర రసాయనాలు) ఉండడంతో ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. దీంతో అవి సముద్రంలో కలిసిన తరువాత అక్కడ ఉండే మత్స్య సంపద, ఇతర జీవరాశులు మరోచోటకు తరలిపోతున్నాయంటున్నారు. శుద్ధిచేసే సమయంలో ప్రమాణాలు పాటించడం లేదని, అందుకే చేపల వేట గణనీయంగా తగ్గిపోయిందని మత్స్యకారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యర్థ జలాల వల్ల సముద్రంలో కాలుష్యం పెరిగిందనే వాదనతో ఉప ముఖ్యమంత్రి ఏకీభవించారు. వ్యర్థ జలాల విడుదలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సముద్రంలో కాలుష్యం తీవ్రత తగ్గేలా చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలతో పీసీబీ అప్రమత్తమైంది. ఇప్పటివరకూ పలు పరిశోధన సంస్థలలో తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తుండగా ఇక నుంచి వాటితో పాటు మరికొన్ని సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించింది. నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని పీసీబీ యోచిస్తోంది.

డీఆర్వో X ఆర్డీవో

... 7వ పేజీ తరువాయి

ఉండాలి. అయితే శ్రీలేఖ మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు మండలాల నుంచి సమాచారం కావాలనుకుంటే నేరుగా సంబంధిత తహశీల్దార్లతో మాట్లాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అంబేడ్కర్ విగ్రహం వివాదంపై కలెక్టర్ షోకాజ్ ఇచ్చిన నేపథ్యంలో సమాచారం కోసం ఆర్డీవో కలెక్టరేట్‌లో ఒక అధికారికి రెండుసార్లు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని తెలిసింది. ఇదిలావుండగా పెందుర్తి, గాజువాక, సీతమ్మధార, పద్మనాభం తహశీల్దారు కార్యాలయాల సిబ్బంది ద్వారా డీఆర్వో ఇంటి సామగ్రి తెప్పించుకుంటున్నట్టు ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదుపై నిఘా వర్గాలు శుక్రవారం ఆరా తీశాయి. ఆయా తహశీల్దారు కార్యాలయాలకు వెళ్లి సిబ్బందిని వాకబు చేశాయి. ఇంకా కలెక్టరేట్‌లో పలు సెక్షన్‌లలో అధికారులు, సిబ్బంది నుంచి కూడా సమాచారం సేకరించారు. కాగా డీఆర్వోపై ఆర్డీవో ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి త్రినాథ్, శ్యాంసుందర్ కలిశారు. డీఆర్వో సరుకుల కోసం ఇండెంట్ పెడుతున్నట్టు ఆర్డీవో చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవోపై ఫిర్యాదు చేశారు. ఈ వివాదం ఇంకా కొనసాగితే జిల్లాలో పాలన సజావుగా సాగదని రెవెన్యూ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అప్పన్న ఆభరణాలపై దాగుడుమూతలు

... 7వ పేజీ తరువాయి

గల్లంతు కావడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఆ శాఖ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ అంశాన్ని మరుగుపరచేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. కడపకు చెందిన వ్యక్తికి కొంత మొత్తం ముట్టజెప్పి ఫిర్యాదును ఉపసంహరింపజేసే మంతనాలు జరుగుతున్నాయని ఆలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వారం రోజుల్లో ప్రకటన

ఆభరణాల గల్లంతు విషయమైన డిప్యూటీ ఈఓ రాధను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విచారణ జరుగుతున్నందున తాను మాట్లాడకూడదని తెలిపారు. వారం రోజుల్లో ఈఓ దీనిపై ప్రకటన చేస్తారని సమాధానమిచ్చారు.

అగ్గిపుడితే బుగ్గే!

... 7వ పేజీ తరువాయి

ఒక్కోటి రూ.12 లక్షలకు వ్యాపారులకు విక్రయించేయడం విశేషం. కొమ్మాదిలో కూడా ఇదే మాదిరి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే జోన్-2 టౌన్‌ప్లానింగ్, పోలీస్ అధికారులు వాటిని శుక్రవారం తొలగించారు. కానీ నగరంలో అధికారులు చోద్యం చూస్తుండడం గమనార్హం. అనుమతులు వస్తాయనే ధీమాతో ఒకవేళ ఎవరైనా దుకాణాలు ఏర్పాటుచేసినా అగ్నిమాపక శాఖ అధికారులు వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వెంటనే సరిచేసేలా ఆదేశించాలి. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేని విధంగా జాగ్రత్తలు పాటించడంతోపాటు ఏదైనా జరిగితే సకాలంలో మంటలను అదుపుచేయగలిగే పరిస్థితి ఉండేలా చూడాలి.కానీ మూడు అడుగులు దూరంలోనే దుకాణాలు ఏర్పాటుచేస్తుంటే అగ్నిమాపకశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఆ శాఖ పనితీరుకు అద్దంపడుతోంది. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దుకాణాలన్నింటికీ క్షణాల్లో మంటలు వ్యాపించే అవకాశం ఉంది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని నివాసాలు, భవనాలకు సైతం ముప్పు పొంచి ఉంటుందనే విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు బదిలీ

విశాఖ బాధ్యతలు శ్రీకాకుళం డీఎస్పీ రమణమూర్తికి అప్పగింత

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ రమణమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విశాఖ ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న బీవీఎస్ నాగేశ్వరరావును విజయవాడలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీగా బదిలీ చేసింది. శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న రమణమూర్తికి విశాఖ ఏసీబీ డీఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

రోడ్డుపై మురుగు నీటితో ఇబ్బందులు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస వద్ద రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నాలుగు కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. కళాశాలలు, హాస్టళ్లకు చెందిన వాడక నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రధాన రహదారిపైకి విడిచి పెడుతున్నారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడడమే కాకుండా దుర్గంధం వల్ల నరకయాతన అనుభవిస్తున్నారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాడక నీటితో పాటు మురుగు నీరు రహదారిపై చేరడంతో మడుగు మాదిరి తయారైంది. ఈ విషయమై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 28 వినతులు



వినతులు స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 28 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు/వినతులు ఎక్కువగా వస్తున్నందున ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతులను/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ఈ ఓపెన్ ఫోరమ్‌లో ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 28, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 86, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, క్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఏయూలో 126 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేసిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సందర్భంగా భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఏయూ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం టీఎల్ఎన్ సభాహాలులో భగత్‌సింగ్ మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ దీన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. రక్తదానం వంటి మానవతా కార్యక్రమాలు విశ్వవిద్యాలయ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయన్నారు. శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు విద్యార్థులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 126 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి వైస్‌చాన్సలర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి ఎల్‌జే నాయుడు, అధ్యక్షుడు జి.అజయ్, యూనివర్సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కుసుమాంజలి, డి.వెంకటరమణ పాల్గొన్నారు.

అర్ధరాత్రి పారిశుధ్య పనుల తనిఖీ

వెంకోజీపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ చేపడుతున్న పారిశుధ్య పనులు చిత్తశుద్ధితో నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి ఆయన సిరిపురం దత్ ఐలాండ్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక్కొక్కరు ఎంత పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు? ఏ సమయం నుంచి ఏ సమయం వరకు విధుల్లో ఉంటున్నారో ఆరా తీశారు. వారికి పరికరాలు, జీతభత్యాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అడిగి తెలుసుకున్నారు. రాత్రి పూట పారిశుధ్య పనులతో నగరం మరింత సుందరంగా కనిపిస్తుందన్నారు. విధులను ఎంతో బాధ్యతతో నిర్వహించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనరు హితవు పలికారు.



సిరిపురం కూడలిలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

'ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలి'

సిరిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.హర్షలత అన్నారు. స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా శుక్రవారం ఆకాశవాణి కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆకాశవాణిలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షలత మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులు తమ ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'ధ్యానంతో ఒత్తిడి నియంత్రణ'



డాక్‌యార్డ్ ఉద్యోగులతో డాక్టర్ గీత, ప్రొఫెసర్ కృష్ణమోహన్ తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, వృత్తిపరంగా ఎదురయ్యే ఒత్తిళ్లను ధ్యానం చేయడం ద్వారా నియంత్రించుకోవచ్చని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ వుమెన్స్ వింగ్ కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ యార్లగడ్డ గీత పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో శుక్రవారం నేవల్ డాక్ యార్డ్ ఉద్యోగులకు పదిరోజుల శిక్షణ కారక్రమంలో భాగంగా ఒత్తిడిని అధిగమించే (స్ట్రెస్ మేనేజ్‌మెంట్) మార్గాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వక్తగా పాల్గొన్న డాక్టర్ గీత మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడిపేందుకు ధ్యానం ఎంతో దోహదం చేస్తుందన్నారు. రోజూవ్యాయామం, ధ్యానం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. 45 నిమిషాలకు పైగా రోజూ నడవడం వల్ల శరీరంలో అనేక మార్పులు సంభవిస్తాయన్నారు. 10, 15 నిమిషాలు మాత్రమే నడిచి, రోజువారీ పనుల్లో శ్రమ ఉందని భావించడం కాదని, ఏకాగ్రతతో 45 నిమిషాలునడిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు.ఐఐఏఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యానికి ఉపయోగపడే ధ్యానాన్ని అందరూ వెంటనే ప్రారంభించాలన్నారు. సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ ఒత్తిడితో కూడుకున్న జీవితాలకు భావోద్వేగ సమతుల్యత ఎంతో అవసరమన్నారు.ఈ సందర్భంగా ఐఐఏఎం తరపున డాక్టర్ గీతను సత్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సూర్యప్రకాశరావు

బీచ్‌రోడ్డులో ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా వాక్‌థాన్



ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

బీచ్ రోడ్డు, అకోబర్ 17, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ బి.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యకర సమాజాన్ని చూడగలుగుతామన్నారు. ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా క్లాత్, పేపర్ బ్యాగులు, గాజు, స్టీల్ పాత్రలు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, గుడ్డ, నార సంచులను వాడాలన్నారు. విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని ప్రజలందరూ స్వచ్ఛ భారత్ సహకారంతో ప్రజలు భాగస్వామ్యం కావాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ సత్యసాయి రాత్, ఇన్‌కంట్యాక్స్ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలి

» కేడీపీఎం హైస్కూల్‌ను సందర్శించిన ఆర్జేడీ విజయభాస్కర్



విద్యారుల నోటు పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

పెదవాల్తేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఆర్‌జేడీ బి.విజయ భాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఈస్టు పాయింట్ కాలనీలో గల కేడీపీఎం హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10 నుంచి 8వ తరగతి విద్యార్థుల నోటు పుస్తకాలలో దిద్దుబాట్లు, పఠన, లిఖిత నైపుణ్యాలను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాని, ఏ విద్యార్థినీ కించపరచకుండా అందరినీ చదివేలా ప్రోత్సహిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదనోపాధ్యాయురాలు సుమతిబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఆదివారం ఆర్గానిక్ సంత



వివరాలు వెల్లడిస్తున్న గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం సభ్యులు

మద్దిలపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ప్రతీ ఆదివారం ఆర్గానిక్ సంత నిర్వహిస్తామని భారతీయ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు జె.కుమారస్వామి తెలిపారు.శుక్రవారం నిర్వహించిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్‌లో 19న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంత ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎటువంటి హానికరమైన రసాయనాలు వినియోగించకుండా పండించిన బియ్యం, పప్పులు, కూరగాయలు, చెక్క గానుగ నూనెలు, బెల్లం, ఖాదీ, చేనేత వస్త్రాలను విక్రయిస్తామన్నారు. కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్, బయో ఫెర్టిలైజర్స్, హస్తకళలు మొదలైన వాటిపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, అశోక్ పాల్గొన్నారు.

'ఉద్యోగాల కల్పనపై గూగుల్‌తో ప్రకటన చేయించాలి'

మద్దిలపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకుని, ఉద్యోగాల కల్పనపై ప్రకటన చేయించాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తే రాష్ట్రానికి వచ్చే ఆదాయమెంతో ప్రజలకు తెలియజేయాలన్నారు. గూగుల్‌డేటా సెంటర్ ప్రయోజనాలపై ప్రజల నుంచి చాలా ప్రశ్నలు వస్తున్నాయన్నారు. ఆ ప్రశ్నలనే ప్రభుత్వం ముందుంచితే లోకేష్ ఎగతాళి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. నేను హేళన చేయడం మొదలుపెడితే లోకేష్ తట్టుకోలేరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గూగుల్ డేటా సెంటర్లు, డెవలప్ సెంటర్లు, రీసెర్చ్ సెంటర్‌లలో 1.87లక్షల మంది పనిచేస్తున్నారని, అలాంటప్పుడు విశాఖలో రానున్న డేటా సెంటర్‌లో 1.90 లక్షల మందికి ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

దీపావళి దుకాణాల వద్ద జేబు దొంగలతో జాగ్రత్త

» త్రీటౌన్ క్రైం ఎస్ఐలు సల్మన్, సునీల్‌ల సూచన



బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసిన మైదానాన్ని పరిశీలిస్తున్న త్రీటౌన్ క్రైం పోలీసులు

మద్దిలపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాల సమయంలో జేబు దొంగలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని త్రీటౌన్ క్రైం ఎస్ఐలు సల్మన్, సునీల్ కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా స్టాల్స్‌ను శుక్రవారం వారు పరిశీలించారు. కొనుగోలుదార్లకు పార్కింగ్ స్థలం, ఎన్ని స్టాల్స్, ఎటు వైపు నుంచి ప్రవేశం కల్పిస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. భారీ సంఖ్యలోకొనుగోలుదారులు వచ్చేఅవకాశం ఉన్నందున జేబు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారన్నారు. దొంగతనాలకు తావు లేకుండా క్రైం పోలీసులు నిఘాపెడతారని తెలిపారు. నిర్వాహకులు కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

హిడెన్ స్ప్రౌట్స్‌లో దీపావళి సందడి

» వివిధ ఆకృతుల్లో ప్రమిదలు రూపొందించిన విద్యార్థులు



ప్రమిదలు తయారు చేస్తున్న విద్యార్థులు



చిన్నారులు రూపొందించిన రంగురంగుల ప్రమిదలు

పెదవాల్తేరు, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో దీపావళి సంబరాలు రంగులమయంగా కనుల పండుగగా జరిగాయి. శుక్రవారం పాఠశాల అవరణలో మానసిక దివ్యాంగ విద్యార్థులు 60 రకాల వివిధ రంగుల అకృతులతో కూడిన మట్టి ప్రమిదలను తయారు చేసి వాటికి చూడముచ్చటైన రంగులను వేసి ప్రదర్శనకు ఉంచారు. పాఠశాల పేరును ప్రమిదలతో అలంకరించి మరింత ఆకర్షణగా ఉంచారు. అనంతరం పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు చిట్టి చేతులతో రూపొందించిన ప్రమిదలు చూడముచ్చటగా ఉన్నాయని, వీరిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఎన్నో అకృతుల్లో ప్రమిదలు రూపొందించడం ఆనందంగా ఉందన్నారు. దీపావళిని అందరూ కాలుష్య రహితంగా జరుపుకోవాలని సూచించారు. పిల్లల చేత తయారు చేసి రంగులు వేసిన ప్రమిదలను స్కూల్‌కి సహకరిస్తున్న దాతలు, నగరంలో ప్రముఖులకు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మధు, ఉపాధ్యాయులు సురేష్, ప్రియాంక, పద్మ, స్వాతి, శైలజ, రాజు, భవానీ, నాగవేణి, మానసిక వికలాంగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గూగుల్ విలువ గుడివాడకు తెలుసా?

» వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్

సిరిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో యావత్ ప్రపంచం విశాఖ వైపు చూస్తోందని, దీని విలువ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు మాత్రం తెలిసినట్టు లేదని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడిగుడ్డు కథలు చెప్పుకొని తిరిగే గుడివాడ అమర్నాథ్‌కు గూగుల్ విలువ ఏం తెలుసని? ఎద్దేవా చేశారు. విశాఖ ఖ్యాతి ప్రపంచానికి తెలిసేలా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని, కానీ, వైసీపీ నాయకులు మాత్రం దీన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. విశాఖ అభివృద్ధిని అడ్డుకోవటమే లక్ష్యమన్నట్టుగా వైసీపీ నాయకులు చేస్తున్న కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఫేక్‌వార్తలు ప్రచారం చేస్తోన్న వైసీపీ బ్యాచ్‌పై కఠిన చర్యలు తీసుకొనేలా పోలీసులను కోరతామన్నారు. విశాఖ నగరానికి గూగుల్ రాకతో మరిన్ని ఐటీ సంస్థలు పెట్టుబడులు పెడతాయన్నారు.

సామూహిక సీమంతాలు

ఆరిలోవ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని ఆఖరి బస్టాప్ వద్ద గల జీవీఎంసీ కల్యాణ మండపంలో అంగన్‌వాడీ కేంద్రంలో 30 మంది గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్సీ-2 కనకమహాలక్ష్మి, ఆరిలోవ మెడికల్ అధికారి డాక్టర్ అనిత, బాలాజీ నగర్ యూపీహెచ్ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాలకు రూ. 4 వేల జరిమానా

» రోడ్లపై వ్యర్థాలు వేస్తుండడంతో జీవీఎంసీ అధికారుల చర్యలు

సీతమ్మధార, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమంతో పాటు ప్లాస్టిక్ సంచులు వినియోగించే వారిపై జరిమానాను విధించారు. శుక్రవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామాటాకీస్ రోడ్డు, ద్వారకానగర్‌లో పలు ప్రాంతాల్లో పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామాటాకీస్ రోడ్డులో గల రెండు ఫర్నిచర్ దుకాణాల నిర్వాహకులు ప్లాస్టిక్ వ్యర్థాలను బయట రోడ్డుపై వేస్తుండడంతో వారికి ఒక్కో దుకాణానికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కోట రమణ, సచివాలయం సెక్రటరీ లక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

సీతంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో మెలోడి క్రియేటర్స్ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన గాత్ర సంగీత సంగీత కచేరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కొణతాల రాజు, ఎంవీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాకారులు బి.కామేశ్వర శర్మ వయోలిన్‌తో సంకీర్తలను ఆలపించారు. మృదంగంపై ఎ.కౌండిల్య, తబలాపై బి.రమణమూర్తి, ఆర్గాన్‌పై సోమేశ్ సహకరించారు. కార్యక్రమంలో భాగంగా నవచైతన్య జానపద కళాకారుల చిన్న రెడ్డి బృందం జానపద గీతాలను ఆలపించి చక్కని నృత్యం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, కె.వెంకటసురేష్, ఎస్.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో దీపావళి సందడి

» ఆకట్టుకుంటున్న పలు ఆకృతుల ప్రమిదలు

» నీటితో వెలిగే దీపాల కొనుగోలుకు పలువురి ఆసక్తి



నీళ్లు పోస్తే వెలిగే దీపాలివి..



ఓ స్టాల్ వద్ద విక్రయిస్తున్న వివిధ ఆకృతుల ప్రమిదలు

మురళీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరిగే పండుగకు నగరంలోనూ అంతే స్థాయిలో నిర్వహిస్తారు. ఇక వీధి రోడ్లలోనూ, రైతు బజార్ల వద్ద, ప్రధాన జంక్షన్లలో మట్టి దీపాలు, ప్రమిదలతో పాటు సరికొత్త రంగురంగుల దీపాలు అలరిస్తున్నాయి. వేలాడే దీపాలు, పాత కాలం నాటి లాంతర్లు కనువిందు చేస్తున్నాయి. చైన్నై ప్రాంతం మార్కెట్ నుంచి కొత్తగా వచ్చిన నీటితో వెలిగే దీపాల కొనుగోలుకు ఎక్కువ శాతం ఆసక్తి చూపుతున్నారు. ఇవి పలు ఆకృతుల్లో లభిస్తున్నాయి. ప్లాస్టిక్‌తో తీర్చిదిద్దిన ఈ ప్రమిదల్లో అమర్చి ఉన్న బ్యాటరీ లైట్ నీరు పోస్తే వెంటనే వెలుగుతుంది. నీరు ఖాళీ చేస్తే ఆఫ్ అయిపోతుంది. నీరే నూనెలా మారి వెలుగులిస్తుంది. ఎన్జీజీవోస్ కాలనీ, మురళీనగర్ సెక్టర్ 8 బస్టాప్ వద్ద ఏర్పాటైన దుకాణాలతో పాటు షాపింగ్ మాల్స్‌లోనూ ఈ తరహా నీటి దీపాలు దర్శనమిస్తున్నాయి. పండుగకు రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో బజార్లు దీపావళి సామగ్రి, అలంకరించే దీపాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

ఎంపీ శ్రీభరత్‌కు పలువురు నేతల అభినందనలు



ఎంపీ శ్రీభరత్‌కు ధర్మ స్థూపాన్ని బహూకరిస్తున్న కార్పొరేటర్ శ్రావణి, కిశోర్‌కుమార్



ఎంపీ శ్రీభరత్‌కికు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అక్కయ్యపాలెం/ సీతంపేట/ కంచరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): భారతదేశం నుంచి ఐక్యరాజ్య సమితిలో ప్రాతినిధ్యం వహించి, విశాఖకు గూగుల్ వచ్చినతర్వాత మొదటిసారిగా నగరానికి విచ్చేసిన విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్‌ను శుక్రవారం ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ కలిశారు. అలాగే పార్టీ కండువా వేసి సత్కరించడంతో పాటు జాతీయ చిహ్నం అశోకుడి నాలుగు సింహాలధర్మ స్థూపాన్ని బహూకరించి అభినందించారు. జీవీఎంసీ 47, 48, 55, 54 వార్డులకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎయిర్‌పోర్ట్‌లో టీడీపీ 25వవార్డు టీడీపీ అధ్యక్షుడు ఇసరపు వాసు, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పాలేపు ధనజిలు పుష్పగుచ్చం అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు నక్క పద్మ, లొట్లపార్వతి, అవ్వా కాంతమ్మ, వార్డు నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

సీతంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుర్గాగణపతి ఆలయం నుంచి సీతంపేటలో పలు ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీడీవో రాము, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఇసరపు వాసు, నారా కిషోర్, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రణవ్‌గోపాల్ జన్మదినవేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న ఈతలపాక సుజాత

కంచరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ జన్మదిన వేడుకలను శుక్రవారం జీవీఎంసీ 55 వార్డులో ఘనంగా నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత ఆధ్వర్యంలో స్థానిక గంగన్న నగర్‌లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రణవ్ సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఈశ్వర్రావు, నగేష్, అప్పలనర్సమ్మ, సత్యవతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

కపీశ్వర్ ఎనర్జీ స్టేషన్ ప్రారంభం



పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, పాల్గొన్న వెంకన్న చౌదరి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, గౌతు శిరీష (పలాస) తదితరులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కైలాసపురం రహదారిలో ఏర్పాటు చేసిన కపీశ్వర్ ఎనర్జీ స్టేషన్ (పెట్రోల్ బంక్)ను శుక్రవారం ఎంపీ శ్రీభరత్, విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం గౌతు శిరీష, భారత్ పెట్రోలియం దక్షిణ భారత అధికారి రవి సహాయ్, ఆంధ్ర ప్రాంత అధికారి నితిన్ సెలుకర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఇక పెట్రోల్ బంకుల్లో కేవలం ఇంధనం అమ్మకాలతో పాటు ఖాతాదారులకు పట్టణాల్లో అనేక రకాల సేవలు అందించే సమయం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కైలాసపురం, సాలిగ్రామపురం ప్రాంతాల్లో జరుగుతున్న వ్యాపార సంస్థల ఏర్పాటు, అభివృద్ధి వల్ల పరిసర ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ వ్యవస్థాపకులు యార్లగడ్డ వెంకన్నచౌదరి, ప్రభాకర్ మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సర్వీసు అందిస్తామని, తద్వారా అందరి మన్ననలు అందుకుంటామన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఐ దేముడుబాబు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం : సీఐ

మహారాణిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ దేముడుబాబు సూచించారు. శుక్రవారం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా యువత ఆన్‌లైన్ మోసాలకు లోను కాకుండా ఉండాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుజాత, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

జ్ఞానాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరి హరాత్మజ అన్నదాన ఛారిటబుల్ ట్రస్ట్, కోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నారాయణ సేవ (అన్నదానం) నిర్వహించనున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు కంచుమూర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన ఆ సంఘం సభ్యులతో కలిసి వైర్లస్ కాలనీ కోదండ రామాలయంలో నారాయణ సేవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాలధారణ చేసిన భక్తులందరికీ 41 రోజుల పాటు అన్నప్రసాద వితరణ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె. కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు కడగల శ్రీను, సభ్యులు కె. సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, అవతార్ పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో గణిత పోటీలు



విజేతలతో కళాశాల సిబ్బంది

జ్ఞానాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్ కళాశాలల గణిత పోటీలు నిర్వహించారు. కళాశాలలోని గణిత విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఏవీఎన్ కళాశాల, బీవీకే, ప్రిజం, వీఎస్ కృష్ణ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వారికి క్విజ్, సూడోకో, మైండ్ మేస్, థింక్ ట్యాంక్ వంటి విభాగాల్లో పోటీలు జరిపారు. విజేతలకు ముఖ్యఅతిథులు సర్టిఫికెట్లు,జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సిస్టర్ షైజీ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే వంశీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 31వ వార్డులోని డ్వాక్రా బజార్ వద్ద స్వయం సహాయ సంఘాల మహిళల ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక శ్రేయస్సు కోసం మెప్మా ఆధ్వర్యంలో రూపొందించిన 'సఖి సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల మహిళల ఆరోగ్యాన్ని కాపాడి వారు ఆర్థిక సుస్థిరత సాధించేలా చేయడమే సఖి సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఏ ఇంటికైనా మహిళలు శక్తివంతంగా ఉంటేనే ఆ ఇంటికి కళ అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని, ప్రతి మహిళ తమకు నచ్చిన రంగంలో రాణించేలా కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం మహిళలకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



విద్యుత్ సర్కిల్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

మహారాణిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ, యూనైటెడ్ ఎలక్టసిటీ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ సర్కిల్ ఆఫీస్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న నిరసనలకు పూర్తి మద్దతు ఇస్తున్నామని చెప్పారు. మీటర్ రీడర్లు, స్టోర్ హమాలీలకు పీస్ రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, ఏటీపీ ఆపరేటర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, గ్రేడ్ 2 ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే సంస్థను ప్రైవేటీకరణ చేసే చర్యలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి. సత్యనారాయణ, ప్రేమ చంద్రశేఖర్, ఆర్. సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో కొత్త డయాలసిస్ యూనిట్



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ రైల్వే ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా, వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మెరుగుపరచడంలో భాగంగా డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య సంరక్షణ కల్పించడమే లక్ష్యంగా ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఈ. శాంతారామ్, ఇతర బ్రాంచి అధికారులు, మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

21న డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన

డాబాగార్డెన్స్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21న తొలి తెలుగు టాకీ సినిమా నేపథ్య గాయనీమణి రావు బాల సరస్వతీదేవి తెలుగు సినీ రంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ ప్రత్యేక డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన నిర్వహించనున్నట్టు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని, అనంతరం చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు పురస్కారాల ప్రదానం రేపు

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏయూలోని కోదండ రామయ్య స్మారక భవన్‌లో ఆదివారం క్రీడా దినోత్సవ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె. సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఏటా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉత్తమ క్రీడాకారుడు, ఉత్తమ కోచ్, ఉత్తమ పీఈటీ అవార్డులతో పాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను గౌరవిస్తున్నామని చెప్పారు. ఈసారి జాతీయ క్రీడా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన నేపథ్యంలో క్రీడాకారులకు పురస్కారాలు అందించలేకపోయామని, ఈమేరకు ఆదివారం ఏయూలో ప్రత్యేకంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించి ప్రతిభా పురస్కారాలు అందించనున్నామని తెలిపారు.

అర్ధరాత్రి పారిశుధ్య పనులు తనిఖీ



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ గార్గ్

వెంకోజీపాలెం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ చేపడుతున్న పారిశుధ్య పనులు చిత్తశుద్ధితో నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి ఆయన సిరిపురం దత్ ఐలాండ్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్కరు ఎంత పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు ? ఏ సమయం నుంచి ఏ సమయం వరకు విధుల్లో ఉంటున్నారని ఆరా తీశారు. పరికరాలు, జీతభత్యాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. రాత్రి పూట పనులతో నగరం మరింత సుందరంగా కనిపిస్తుందన్నారు.బాధ్యతగా విధులు నిర్వహించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు.

కల్నల్ సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీ..

వెంకట రాహుల్, అభినవ్ సెంచరీలు



ఎం.అభినవ్



ఎస్.వెంకట్ రాహుల్

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్నల్ సి.కె.నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీలో భాగంగా అనంతపూర్‌లో ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర క్రికెటర్లు రాణించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన ఆంధ్ర రెండో రోజు ఆట ముగిసేసరికి 149 ఓవర్లలో నాలుగు వికెట్లకు 470 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్‌లో సాయిశ్రావణ్ హాఫ్ సెంచరీ (73), జీఎస్వీ తేజ (76) హాఫ్ సెంచరీలు సాధించగా కెప్టెన్ హేమంత్ రెడ్డి (48) రాణించి అద్భుతమైన ఆరంభాన్నిచ్చారు.

తర్వాత స్థానాల్లో దిగిన ఎస్.వెంకట్ రాహుల్ అజేయ సెంచరీ (151 నాటౌట్), ఎం.అభినవ్ సెంచరీ (101) సాధించి జట్టుకు భారీ స్కోరు అందించారు. రాహుల్, అభినవ్ కలిసి నాలుగో వికెట్‌కు 242 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పడం విశేషం.

ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు బదిలీ

విశాఖ బాధ్యతలు శ్రీకాకుళం డీఎస్పీ రమణమూర్తికి అప్పగింత

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీ రమణమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం విశాఖ ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న బీవీఎస్ నాగేశ్వరరావును విజయవాడలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీగా బదిలీ చేసింది. శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న రమణమూర్తికి విశాఖ ఏసీబీ డీఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

అగ్గిపుడితే బుగ్గే!

... 7వ పేజీ తరువాయి

ఒక్కోటి రూ.1.2 లక్షలకు వ్యాపారులకు విక్రయించేయడం విశేషం. కొమ్మాదిలో కూడా ఇదే మాదిరి అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే జోన్-2 టౌన్‌ప్లానింగ్, పోలీస్ అధికారులు వాటిని శుక్రవారం తొలగించారు. కానీ నగరంలో అధికారులు చోద్యం చూస్తుండడం గమనార్హం.

అనుమతులు వస్తాయనే ధీమాతో ఒకవేళ ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేసినా అగ్నిమాపక శాఖ అధికారులు వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వెంటనే సరిచేసేలా ఆదేశించాలి. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేని విధంగా జాగ్రత్తలు పాటించడంతోపాటు ఏదైనా జరిగితే సకాలంలో మంటలను అదుపుచేయగలిగే పరిస్థితి ఉండేలా చూడాలి. కానీ మూడు అడుగులు దూరంలోనే దుకాణాలు ఏర్పాటుచేస్తుంటేఅగ్నిమాపకశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఆ శాఖ పనితీరుకు అద్దంపడుతోంది. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే దుకాణాలన్నింటికీ క్షణాల్లో మంటలు వ్యాపించే అవకాశం ఉంది.

చుట్టుపక్కల ప్రాంతాల్లోని నివాసాలు, భవనాలకు సైతం ముప్పు పొంచి ఉంటుందనే విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు హెచ్చరిస్తున్నారు.

అప్పన్న ఆభరణాలపై దాగుడుమూతలు

... 7వ పేజీ తరువాయి

గల్లంతు కావడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఆ శాఖ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అందుకే ఈ అంశాన్ని మరుగుపరచేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. కడపకు చెందిన వ్యక్తికి కొంత మొత్తం ముట్టజెప్పి ఫిర్యాదును ఉపసంహరింపజేసే మంతనాలు జరుగుతన్నాయని ఆలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

వారం రోజుల్లో ప్రకటన

- రాధ, డిప్యూటీ డీఈఓ

ఆభరణాల గల్లంతు విషయమైన డిప్యూటీ ఈఓ రాధను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతున్నందున తాను మాట్లాడకూడదని తెలిపారు. వారం రోజుల్లో ఈఓనే దీనిపై ప్రకటన చేస్తారని సమాధానమిచ్చారు.

డీఆర్వో వర్సెస్ ఆర్డీవో

... 7వ పేజీ తరువాయి

ఉండాలి. అయితే శ్రీలేఖ మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు మండలాల నుంచి సమాచారం కావాలనుకుంటే నేరుగా సంబంధిత తహశీల్దార్లతో మాట్లాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

అంబేడ్కర్ విగ్రహం వివాదంపై కలెక్టర్ షోకాజ్ ఇచ్చిన నేపథ్యంలో సమాచారం కోసం ఆర్డీవో కలెక్టరేట్‌లో ఒక అధికారికి రెండుసార్లు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని తెలిసింది. ఇదిలావుండగా పెందుర్తి, గాజువాక, సీతమ్మధార, పద్మనాభం తహశీల్దారు కార్యాలయాల సిబ్బంది ద్వారా డీఆర్వో ఇంటి సామగ్రి తెప్పించుకుంటున్నట్టు ఆర్డీవో ఇచ్చిన ఫిర్యాదుపై నిఘా వర్గాలు శుక్రవారం ఆరా తీశాయి. ఆయా తహశీల్దారు కార్యాలయాలకు వెళ్లి సిబ్బందిని వాకబు చేశాయి. ఇంకా కలెక్టరేట్‌లో పలు సెక్షన్‌లలో అధికారులు, సిబ్బంది నుంచి కూడా సమాచారం సేకరించారు. కాగా డీఆర్వోపై ఆర్డీవో ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి త్రినాథ్, శ్యాంసుందర్ కలిశారు. డీఆర్వో సరుకుల కోసం ఇండెంట్ పెడుతున్నట్టు ఆర్డీవో చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవోపై ఫిర్యాదు చేశారు. ఈ వివాదం ఇంకా కొనసాగితే జిల్లాలో పాలన సజావుగా సాగదని రెవెన్యూ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఫార్మా కాలుష్యానికి చెక్

... 7వ పేజీ తరువాయి

నిర్ధారించుకున్న తరువాతే సముద్రంలోకి విడిచిపెడుతున్నామని అధికారులు చెబుతున్నారు. అయితే నిర్దేశించిన ప్రమాణాల కంటే అధికంగా వ్యర్థ జలాలను ఉత్పత్తి అవుతుండడంతో శుద్ధి చేయకుండానే కాల్వల ద్వారా సముద్రంలోకి వదులుతున్నారనేది ఆరోపణలు ఉన్నాయి.

అలాగే పరిశ్రమలు శుద్ధి చేసినట్టుగా చెబుతున్న జలాల్లో కూడా ప్రమాణాలకు మించి రసాయన అవశేషాలు ఉంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ జలాల్లో బలమైన ఆక్సీకరణ కారకాలు (ఫాస్పేట్, నైట్రోజన్, క్రోమియం, ఇతర రసాయనాలు) ఉండడంతో ఆక్సిజన్ పరిమాణం తగ్గుతుంది. దీంతో అవి సముద్రంలో కలిసిన తరువాత అక్కడ ఉండే మత్స్య సంపద, ఇతర జీవరాశులు మరోచోటకు తరలిపోతున్నాయంటున్నారు. శుద్ధిచేసే సమయంలో ప్రమాణాలు పాటించడం లేదని, అందుకే చేపల వేట గణనీయంగా తగ్గిపోయిందని మత్స్యకారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యర్థ జలాల వల్ల సముద్రంలో కాలుష్యం పెరిగిందనే వాదనతో ఉప ముఖ్యమంత్రి ఏకీభవించారు. వ్యర్థ జలాల విడుదలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సముద్రంలో కాలుష్యం తీవ్రత తగ్గేలా చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలతో పీసీబీ అప్రమత్తమైంది. ఇప్పటివరకూ పలు పరిశోధన సంస్థలలో తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తుండగా ఇక నుంచి వాటితోపాటు మరికొన్ని సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించింది. నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని పీసీబీ యోచిస్తోంది.



చెక్కును అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోపాలపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ ఫలాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. నియోజకవర్గంలో పలు వార్డులకు చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4 లక్షల సీఎం ఆర్ఎఫ్ చెక్కులను గణబాబు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

» 86వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలతో నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక అని, కష్టపడే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు టీడీపీ కార్యాలంయలో వార్డు అనుబంధ సంఘాల్లో పదవులు దక్కించుకున్న పలువురికి శుక్రవారం శాలువా వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధిపై ఇంజనీర్ల సమీక్ష

గాజువాక, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో అభివృద్ధి పనులతో పాటు సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా పనులు పనిచేయాలని గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి పేర్కొన్నారు. జోనల్ కార్యాలయంలో ఇంజనీర్లతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యవేక్షణ నిమిత్తం ఒక్కో వార్డుకు ఒక్కో ఇంజనీర్‌ను నియమించామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. వార్డులోని రోడ్ల మరమ్మతులు, వీధిలైట్ల నిర్వహణ, ఇతర సమస్యలను తక్షణమే పరిగణలోకి తీసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ఆయా సమస్యలను క్షేత్రసాయిలో పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుల ఇంజనీర్లు పాల్గొన్నారు.

'పరీక్షలకు ప్రణాళిక తప్పనిసరి'

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ప్రణాళిక ప్రకారం చదవాలని, పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా బాధ్యతలు తీసుకోవాలని ఇస్లాంపేట హైస్కూల్ హెచ్ఎం జి.ప్రమీల అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు శుక్రవారం వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సెల్‌ఫోన్‌లు ఇవ్వవద్దని, పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ తెలిపారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో శుక్రవారం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలతో కలసి పలు ఇళ్లకు వెళ్లి జీఎస్టీపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ శ్లాబులను 4 నుంచి 2కు తగ్గిండం శుభ పరిణామమన్నారు. దీని ద్వారా నిత్యావసర ధరలు ఏ విధంగా ఉంటాయనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డ అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, తిరుమల నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.


పాత వడ్లపూడిలో డ్రైడే-ఫ్రైడే

సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. వార్డులోని డ్రైడే - ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రైడే పాటించాలని అన్నారు. పాలిథిన్ వల్ల పర్యావరణానికి కలిగే హానీని వివరించారు. ఈ సందర్భంగా 'పాలథిన్ వద్దు- నార సంచులు ముద్దు' తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, సచివాలయ సిబ్బంది, తదితర నాయకులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో అంధకారం



అంధకారంలో ఉన్న దువ్వాడ రైల్వే రోడ్డు



మేయిన్ రోడ్డుపై కానరాని వీధి దీపాలు

» వీధి దీపాలులేక చీకటిమయంగా పరిసర కాలనీలు
» చీకటిలో దాడి చేస్తున్న వీధి కుక్కలు
» సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం :స్థానికులు

ఆటోనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారులను అంధకారం అలుముకుంటోంది. ఈ మార్గంలో ఉన్న వీధి దీపాలు వందల సంఖ్యలో మరమ్మతులకు గురయ్యాయి. వాటికి తిరిగి అమర్చకపోవడంతో నియోజకవర్గం పరిధిలో పలు కాలనీలు గాడాంధకారంలో మగ్గుతున్నాయి. రాత్రిళ్లు రైళ్లు దిగిన ప్రయాణికులు ఇళ్లకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో విధులు పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న కార్మికులపై చీకటిగా ఉండడంతో వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. అదే విధంగా చీకట్లో రోడ్డు సరిగా కానరాక, రోడ్డుపై ఉన్న గుంతలు కూడా కనిపించక ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డంతా చీకటిగా ఉండడంతో పక్కనే ఉన్న తుప్పల్లోంచి విష సర్పాలు అధికంగా సంచరిస్తున్నాయని, రాత్రి సమయంలో ప్రజలు బయటకీ రావడానికి భయపడుతున్నారు. కొన్ని రోజులగా పాముల సంచారం అధికమైందని, దొంగల బెడద కూడా ఎక్కువగా ఉన్నదని ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ దీపాలను మరమ్మతులు చేయించి భయభ్రాంతులకు గురవుతున్న కాలనీ ప్రజలకు ఉపశమనం కలిగించాలని దువ్వాడ, పరిసర ప్రాంతాల కాలనీ వాసులు కోరుతున్నారు.

పగలే వెలుగులు



పగలే వెలుగుతున్న వీధిదీపం

అగనంపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా ఉన్నది. పలు ప్రాంతాల్లో పట్టపగలే వెలుగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ వీధి దీపాలను నిర్వహణను సంబంధిన అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి పట్టిందని ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతుంటే ఈ ప్రాంతంలో మాత్రం రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నదని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెందుర్తిలో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్‌లో పోలీసులు

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేరాలు నియంత్రించేందుకు సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పెందుర్తిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చినముషిడివాడ, పెందుర్తిలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 17 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెందుర్తిలో నాకాబంధి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద, సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టామని తెలిపారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2**: మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా),నరసింహ(గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 25, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 36, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్58, దొండకాయలు 30, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 70, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 28, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 86, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు



మల్కాపురంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

మల్కాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం పిలకవానిపాలెం జంక్షన్ సమీపంలో ఉన్న ఏపీఐఐసీ స్థలంలో బాణసంచా విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ ఆదివారం నుంచి బాణసంచా వ్యాపారం మొదలవుతుందని తెలిపారు. ఈ స్థలంలో దాదాపు 48 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జీవీఎసీ, అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖల నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే పోలీసులు కూడా తమకు పలు సూచలను చేసినట్టు వాప్యారులు తెలిపారు. అనుమతులు ఉన్నవారు మాత్రమే ఇక్కడ వ్యాపారం చేయాలని అనుమతులు లేని వారు వ్యాపారం చేయవద్దని సూచించారు.

ఎన్ఏడీ జంక్షన్‌లో..

ఎన్.ఎ.డి.జంక్షన్, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ జంక్షన్ ఆల్ఫా హోటల్ వెనుకు ఉన్న స్థలంలో బాణసంచా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రదేశంలో 15 దుకాణాలు ఏర్పాటు చేసేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారు. దుకాణదారులు తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో వంటిల్లు పక్కన విక్రయ స్టాళ్లను ఏర్పాటు చేసినప్పటికీ, కొన్ని అనివార్య కారణాల వల్ల స్థలం మార్చామని నిర్వహకులు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయులకు నివాళి

అగనంపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెంలో శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ అనంతరం పలువురు మాట్లాడుతూ తెలుగు భాష ప్రాచీన హోదాకు రాయులవారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శలో సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రహీమ్‌తుల్లా

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్ పై విద్యార్థులకు రెడ్ క్రాస్ వైద్యుడు రహీమ్‌తుల్లా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన గుండెపోటు, శ్వాస, స్పందన కోల్పోయినప్పుడు ప్రాణాలను రక్షించడానికి చేసే అత్యవసర వైద్య ప్రక్రియ అని అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియలో ఛాతిని రెండు చేతులతో నొక్కడం, నోటితో ఊపిరితిత్తుల్లోకి గాలి ఊదడం వంటి అంశాలను విరించారు. హృదయ సంబంధిత లక్షణాలతో ఇబ్బంది పడిన వారికి సీపీఆర్ చేయగలిగితే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యపకులు పాల్గొన్నారు.

సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి :సీపీఐ

పెదగంట్యాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ యూనిట్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆనంద్ డిమాండ్ చేశారు. నివాస ప్రాంతాలకు అతి సమీపంలో సిమెంట్ యూనిట్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 64వ వార్డు గంగవరంలో సీపీఐ సభ్యులు ఇంటింటా ప్రచారం శుక్రవారం నిర్వహించారు. సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగంట్యాడలో సిమెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అంతా బూడిద మయం అవుతుందన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

వేపగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెందుర్తి పరిధిలో ఉన్న పలు మద్యం దుకాణాలు, వివిధ ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించి రెండు కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ ఎం. సరోజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ముందే మద్యం విక్రయిస్తున్న లక్ష్మీ బార్, అక్రమంగా 10 మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా బెల్ట్‌షాపులు ఎక్కడన నిర్వహించినా తమకు సమాచారం అందించాలని స్థానికులకు సూచించారు.

పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు

గోపాలపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 'సేవ్ గర్ల్ చైల్డ్' దినోత్సవాన్ని పురస్కరించుకుని గోపాలపట్నం మండలంలోని పలు పాఠశాలల్లో మండల విద్యాశాఖ పలు పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం ఎండీవో దివాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ పోటీల్లో విజేతలకు తోటగరువు పాఠశాలలో బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

సామూహిక అన్నప్రాసన

గోపాలపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 91వ వార్డులోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు ఎన్ సత్తిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం సత్తిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణుకలు బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని బాణసంచా సీజ్

పెందుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిల్వ చేసి విక్రయిస్తున్న బాణసంచాను పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గవరజగ్గయ్యపాలెంలో ఓ ఇంటిలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ చేశారన్న సమాచారం అందిందని తెలిపారు. దీంతో తనిఖీలు నిర్వహించి రూ.30 వేల విలువ గల బాణసంచాను సీజ్ చేశామన్నారు.

క్రీడల్లో మెరిసిన విద్యార్థులు

అగనంపూడి అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా ఈ పోటీలకు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ పోటీల్లో విజేతలు నియోజకవర్గం స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలో

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ప్రాథమికోన్నత, జడ్పీ పాఠశాలల విద్యార్థులకు స్థానిక పీఎంశ్రీ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉన్న పలు పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని వివిధ క్రీడల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

సత్తా చాటిన హైస్కూల్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి): గాజువాక హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన మండల స్థాయి ఖోఖో అండర్14, 17 విభాగాల్లో అక్కిరెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని స్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో ఖోఖోతో పాటు చెస్, షటిల్, క్రీడల్లో కూడా తమ విద్యార్థులు చాటారని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):శ్రీనివాసనగర్‌లో గుట్టుగా సాగుతున్న పేకాటస్థావరంపై శుక్రవారం రాత్రి పెందుర్తి పోలీసులు రైడ్ చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.9,124 నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గోశాల సమీపంలో ఓ ఇంటి మేడపై పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో రైడ్ చేశామని సీఐ సతీశ్‌క కుమార్ తెలిపారు.

అన్నింటా విశాఖ నంబర్‌వన్‌గా ఉండాలి

దిశా సమావేశంలో అధికారులకు ఎంపీ శ్రీభరత్ నిర్దేశం

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా అధికారులంతా కృషి చేయాలని ఎంపీ శ్రీభరత్ నిర్దేశించారు. విశాఖకు ఎన్నో కంపెనీలు వస్తున్నందున మౌలిక వసతుల అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాల సాధనలో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతెన్నులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించారు. జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ, ఇతర అంశాలను చర్చించారు. అజెండా అంశాలను కలెక్టర్ ఎంఎన్ హరేం ధిర ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా అధికారులిచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పార్లమెంట్ స్థానం పరిధిలో అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని, జాతీయ రహదారులను, నగర రహదారులతో అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఎంపీ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలు చేస్తున్న పథకాల ఫలాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించాలని, పీఎం సూర్యఘర్ యూనిట్లను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పాలన్నారు. రాజీవ్ గృహకల్పలో మిగిలిపోయిన ఇళ్లను అర్హులకు కేటాయించాలని, అనధికారికంగా ఉంటున్న వారిని బయటకు పంపాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేజిక్ డ్రైన్ల ద్వారా కలిగే ఫలితాలను పరిశీలించి నివేదించాలన్నారు. జలవనరులను సంరక్షిస్తూ అమృత్, జలజీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటిని అందించాలన్నారు. వర్షపు నీటిని ఆదాచేసి, టెర్రస్ గార్డెనింగ్ ప్రోత్సహించాలన్నారు. ఇటీవల దుకాణాల తొలగింపు ప్రక్రియను ప్రస్తావించిన ఎంపీ.. మళ్లీ తిరిగి పెట్టే క్రమంలో అర్హులకు మాత్రమే అవకాశం ఇవ్వాలన్నారు. త్వరితగతిన వెండింగ్ జోన్లు గుర్తించాలని, జీవనోపాధి కోసం తాప త్రయపడే వారికి సహకరించాలన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజులు టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ కెమయూర్ అశోక్, జడ్పీ సీఈవో, దిశా కన్వీనర్ నారాయణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

లేపాక్షి అంటేనే ఓ సౌందర్యమాలిక

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వ్యాఖ్య


బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

బీచ్ రోడ్డు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): లేపాక్షి అంటేనే ఓ సౌందర్యమాలిక అని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వ్యాఖ్యానించారు. అద్భుతమైన కళాకారులు తయారు చేసిన ముచ్చటగొలిపే కళారూపాలను కొనుగోలు చేయడం ద్వారా వారిని ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో పనిచేస్తున్న లేపాక్షి హస్త కళా సంస్థ ఈ కళాకారులను ప్రోత్సహిస్తూ, అపురూపమైన, సౌందర్యమైన వస్తువులను విక్రయిస్తోందన్నారు. 'సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్'లో భాగంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సెట్విస్ సంయుక్తంగా శుక్రవారం ఆర్కే బీచ్ పాండురంగాపురం వద్ద జిమ్నాస్టిక్స్ ఇండోర్ స్టేడియంలో ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఏర్పాటు చేశాయి. దీన్ని సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ హస్త కళల అభివృద్ధి, పరిరక్షణకు ప్రభుత్వ అజమాయిషీలోని లేపాక్షి హస్తకళా సంస్థ కృషి చేస్తోందన్నారు. కొండపల్లి, ధర్మవరం తదితర ప్రాంత కళాకారులు చూడముచ్చటగా తయారు చేసిన సుమారు వంద రకాల ఆకృతులు ఇక్కడ లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అపురూప వస్తువులతో కూడిన బ్రోచర్‌ను ప్రదర్శించారు. జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో కుట్టుపని, కలంకారి, తోలు వస్తువులు వంటి అనేక రకాల ఉత్పత్తులను చూడవచ్చన్నారు. సెట్విస్ సీఈవో కవిత, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వివాహిత మృతి


మృతి చెందిన వియ్యపు ఉమాదేవి (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం కూడలిలో శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదగంట్యాడ మండలానికి చెందిన వియ్యపు ఉమాదేవి (22) దుర్మరణం చెందగా, ఆమె భర్త పైడిరాజు తీవ్రంగా గాయపడినట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పైడిరాజు విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. అనకాపల్లి మండలం కొత్తూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం తెల్లవారుజామున భార్య ఉమా దేవితో కలిసి స్కూటీపై బయలుదేరాడు. కూర్మన్నపాలెం కూడలి సమీపం లో సింధియా నుంచి చోడవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న పైడిరాజు ఎడమ వైపు, ఉమాదేవి కుడి వైపు రోడ్డుపై పడిపోయారు. ఆమె పైనుంచి బస్సు వెళ్లి పోవటంతో అక్కడికక్కడే దుర్మరణంపాలైంది.ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పైడిరాజు ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవరును అదుపులోనికి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు.

బంగారు ఆభరణాలు రికవరీ చేసిన రైల్వే పోలీసులు

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్లో దొంగతనానికి పాల్పడిన బాలుడిని రైల్వే పోలీసులు పట్టుకుని రూ.7 లక్షల విలువైన 58.308 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు తెలిపారు. గత నెల 19న గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) జనరల్ కోచ్‌లో బంగారు ఆభరణాల దొంగతనం జరిగిందని శ్రీకాకుళం జిల్లాకు చెందిన అట్టులూరి హేమకుమారి అనే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ కేటీఆర్.లక్ష్మి, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ లక్కోజు ఉదయ్‌భాస్కర్, కానిస్టేబుళ్లు జి.దుర్గా ప్రసాద్, ఎం.రాజేష్ దర్యాప్తు చేసి బాలుడిని పట్టుకుని ఆభరణాలు స్వాధీనం చేసుకుని జువైనెల్ హోమ్‌కు తరలించారని పేర్కొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.50 కోట్లు కేటాయించాలి

వీసీ నియామకం అభినందనీయం

జాతీయ విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ మునిరత్నం నాయుడును నియమించడం అభినంద నీయమని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, జాతీయ విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఏయూలోని హిందీ భవన్‌లో శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును అక్కడి ప్రభుత్వం మార్చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని కోరుతూ ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రి, శ్రీశైలం, కూచిపూడిలో కేంద్రాలు ఉన్నాయని, వాటిలో రాజమండ్రి కేంద్రాన్ని తెలుగు విశ్వవిద్యాలయంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాజాగా ఇన్‌చార్జి వీసీని నియమించడంతో తెలుగు విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ముందడుగు పడినట్టు అయిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ మానసిక పుత్రిక అని, సుమారు 22 సబ్జెక్టులను నిర్వహించేవారన్నారు. అదే విధంగా రాజమండ్రి కేంద్రంగా ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయంలో కోర్సులు అమలు చేయాలన్నారు. అందుకోసం రూ.50 కోట్లను కేటాయిస్తే పూర్తి స్థాయిలో విశ్వవిద్యాలయం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.